


# కరపత్రం

SINCE 2014

సోమవారం సెప్టెంబర్ 22 2025 | సంపుటి :0 | సంచిక :334 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4

# తెలంగాణలో బతుకమ్మ సంబరాలు

### తెలంగాణ వ్యాప్తంగా ఘనంగా ప్రారంభమైన బతుకమ్మ వేడుకలు



తెలంగాణ వ్యాప్తంగా బతుకమ్మ సంబురాలు ఘనంగా మొదలయ్యాయి. తెలంగాణ ప్రభుత్వ ఆధ్వర్యంలో హనుమకొండ వేయి స్తంభాల ఆలయం వద్ద నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో మంత్రులు భట్టి విక్రమార్క జూపల్లి కృష్ణారావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖ, సీతక్క తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర ప్రజలందరికీ బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. పూలనే దైవంగా పూజించే విష్టమైన పండుగ బతుకమ్మ అని అన్నారు. రంగురంగుల పువ్వులతో మహిళలు బతుకమ్మలు పేర్చారు. ఈ సందర్భంగా మంత్రులు కొండా సురేఖ, సీతక్క బతుకమ్మ పాటపాడి ఆకట్టుకున్నారు. మరోవైపు తెలంగాణ భవన్, ఖమ్మం, నిజామాబాద్, వరంగల్, హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో ఘనంగా బతుకమ్మ వేడుకలు నిర్వహించారు.




# దేశ ప్రజలకు ప్రధాని గుడ్ న్యూస్..

## ఇక జీఎస్టీ ఉత్సవ్ ప్రారంభం

- సోమవారం నుంచి జీఎస్టీ ఉత్సవ్ ప్రారంభం కానుందని ప్రధాని మోదీ తెలిపారు.
- జీఎస్టీ మార్పులతో పేదలు, మధ్యతరగతి ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.
- దేశ ప్రజలను ఉద్దేశించి ప్రధాని మోదీ ప్రసంగించారు.

న్యూఢిల్లీ: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ దేశ ప్రజలకు దేవీనవరాత్రుల శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం నుంచి జీఎస్టీ ఉత్సవం ప్రారంభమవుతోందని, పేద మధ్య తరగతి వర్గాలకు ఇది డబుల్ బొనంజా అని అభివర్ణించారు. జీఎస్టీతో వన్ నేషన్-వన్ ట్యాక్స్ కలలు సాకరమయ్యాయని అన్నారు. జీఎస్టీ మార్పులతో పేదలు, మధ్యతరగతి ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం 5 గంటలకు దేశ ప్రజలను ఉద్దేశించి ప్రధాని మోదీ ప్రసంగించారు.

సరికొత్త చరిత్ర సృష్టించేందుకు జీఎస్టీ మార్పులు సహకరిస్తాయని ప్రధాని ఈ సందర్భంగా పేర్కొన్నారు. గతంలో దేశంలో రకరకాల పన్నులతో ప్రజల్లో గందరగోళం ఉండేదని, జీఎస్టీ ఆ గందరగోళం నుంచి బయటపడేసిందని చెప్పారు. రేపట్నించి నిత్యావసర వస్తువుల ధరలు తగ్గనున్నాయని, కొత్త జీఎస్టీ వల్ల ఉత్పత్తిదారులు, వినియోగదారలకు ఇద్దరికీ ప్రయోజనకరంగా ఉంటుందని చెప్పారు. వస్తు రవాణా ఖర్చులు గణనీయంగా తగ్గుతాయని అన్నారు. 12 శాతం పన్ను ఉన్న 99 శాతం వస్తువులు 5 శాతం పన్నులోకి వచ్చాయని, పేదలు వాడే అనేక వస్తువులపై సున్నా శాతం జీఎస్టీ ఉంటుందని చెప్పారు. 2లో..

# మీతో కలిసి నడుస్తా..

## మీకు అండగా ఉంటా: మంత్రి వివేక్



హైదరాబాద్: నేను మీతో ఉంటా.. మీతో కలిసి నడుస్తానని అన్నారు మంత్రి వివేక్ వెంకటస్వామి. ఆదివారం (సెప్టెంబర్ 21) జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని సూర్యానగర్ డివిజన్‌లో బూత్ స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. జూబ్లీహిల్స్ బై పోల్ ఇంచార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి, మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్, ఇతర స్థానిక కాంగ్రెస్ నేతలు ఈ సమావేశంలో పాల్గొన్నారు. 2లో..

# వెయ్యి స్తంభాల గుడిలో బతుకమ్మ ఉత్సవాలు ప్రారంభం

- వరంగల్ వెయ్యి స్తంభాల ఆలయంలో బతుకమ్మ సంబరాలు ఘనంగా ప్రారంభమయ్యాయి . డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు జూపల్లి, పొంగులేటి, కొండా సురేఖ, సీతక్క బతుకమ్మ ఉత్సవాలు ప్రారంభించారు.




వరంగల్, సెప్టెంబర్ 21: వరంగల్ వెయ్యి స్తంభాల ఆలయంలో బతుకమ్మ సంబరాలు ఇవాళ(ఆదివారం) ఘనంగా ప్రారంభమయ్యాయి. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కొండా సురేఖ, సీతక్క బతుకమ్మ ఉత్సవాలు ప్రారంభించారు. పూల జాతరకు భారీగా మహిళలు తరలివచ్చారు. బతుకమ్మ సంబరాల నేపథ్యంలో అధికారులు భారీ ఏర్పాట్లు చేశారు.

ప్రకృతి పండగ బతుకమ్మని.. మహిళలు ఆర్థికంగా, సామాజికంగా ఎదగాలని కోరుకుంటున్నాని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని మహిళలు దీవించాలని ఆయన ఆకాంక్షించారు. 2లో..

# నా ఫ్యామిలీపై కుట్రలు చేసినోళ్లను వదలిపెట్టా..

## భరతం పడతా: ఎమ్మెల్సీ కవిత



2లో..

# వరద బాధితులకు సాయం

## అందించడంలో ప్రభుత్వం విఫలం:



హైదరాబాద్: వరద బాధితులకు సాయం అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ మంత్రి, భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. సికింద్రాబాద్ పరిధి రాంగోపాల్‌పేట్‌లోని వరద ముంపు ప్రాంతాల్లో ఆయన పర్యటించి మాట్లాడారు. వర్షాలతో ప్రజలు గల్లంతైన పరిస్థితి ఏర్పడటానికి ప్రభుత్వ వైఫల్యమే కారణమని ఆరోపించారు. 2లో..

# హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం



2లో..

## దిల్లీ వెళ్లి ఆల్మట్టి డ్యామ్‌పై వాదనలు వినిపిస్తాం: మంత్రి ఉత్తమ్



సూర్యాపేట: ఆల్మట్టి డ్యామ్ ఎత్తు పెంపునకు రాష్ట్ర ప్రభుత్వం వ్యతిరేకమని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. సూర్యాపేట జిల్లాలో ఆయన పర్యటించారు. పాలకవీడు మండలంలో జవహర్ జాన్‌పహాడ్ ఎత్తిపోతల పథకం పనులను పరిశీలించారు. 2లో..

## లైంగిక వేధింపుల ఆరోపణలు.. కేఏ పాల్‌పై కేసు నమోదు




హైదరాబాద్: ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ పై పంజాగుట్ట పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. తనను లైంగికంగా వేధించాడంటూ కేఏ పాల్‌పై ఓ యువతి ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# గాజుల రామారంలో..

## కబ్జా చేసినవారిలో నేతలు, ఉన్నతాధికారులు: హైడ్రా కమిషనర్

- హైదరాబాద్‌లోని గాజుల రామారంలో 275 ఎకరాలకు పైగా ప్రభుత్వ భూమి కబ్జాకు గురైందని, దాని విలువ రూ.13 వేల కోట్లు ఉంటుందని అంచనా.



హైదరాబాద్: గాజుల రామారంలో ప్రభుత్వ భూముల ఆక్రమణలు తొలగిస్తున్నామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలిపారు. ప్రభుత్వ భూమిని కబ్జా చేసినవారిలో రాజకీయ నేతలు, ఉన్నతాధికారులు ఉన్నారని చెప్పారు. 40 ఎకరాల్లో పేదలు నివాసాలు ఏర్పాటు చేసుకున్నారని తెలిపారు. 2లో..

## ఇదే నా మరణ వాంగ్మూలం.. మాజీ డీఎస్పీ నళిని బహిరంగ లేఖ



2లో..

కరపత్రం
తెలుగు దిన పత్రిక
సోమవారం సెప్టెంబర్ 22 2025

# సంక్షేమమా సంక్షోభమా

'మింగ మెతుకు లేదు%-% మీసాలకు సంపెంగ నూనె' అన్నది ఒక సామెత! ప్రస్తుతం ఉభయ తెలుగు రాష్ట్రాల పరిస్థితికి ఈ సామెత అచ్చుగుద్దినట్టు సరిపోతుంది. అప్పు చేయనిదే పూట గడవని పరిస్థితి ఉన్నప్పటికీ రెండు రాష్ట్రాల ప్రభుత్వాల మాటలు మాత్రం కోటలు దాటుతున్నాయి. తెలుగు రాష్ట్రాలకు ఈ దుస్థితి ఎందుకు వచ్చింది? ఇందుకు ఎవరు కారణం? 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పుడు తెలంగాణ ధనిక రాష్ట్రమని, రాష్ట్రం రెవెన్యూ మిగులులో ఉందని అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించారు. అదే సమయంలో విభజిత ఆంధ్రప్రదేశ్ రూ.20 వేల కోట్లకు పైగా రెవెన్యూ లోటుతో ఏర్పడింది. 11 ఏళ్లు గడిచేసరికి ధనిక రాష్ట్రమైన తెలంగాణ కూడా అప్పుల కుప్పగా మారింది. అప్పు కోసం వెళితే దొంగను చూసినట్టు చూస్తున్నారని ప్రస్తుత తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసలు వాస్తవాన్ని బయటపెట్టారు. అంతే, తెలంగాణ పరువు తీస్తావా? అని భారత రాష్ట్ర సమితి నాయకులు ఆయనపై విరుచుకుపడ్డారు. ఇక ఆంధ్రప్రదేశ్ విషయానికి వస్తే... ఆ రాష్ట్ర పరిస్థితి పెనం మీద నుంచి పొయ్యిలో పడినట్టుగా ఉంది. రాష్ట్రం అప్పులు పది లక్షల కోట్లు దాటాయి. అటు ధనిక రాష్ట్రం, ఇటు రెవెన్యూ లోటుతో ఏర్పడిన రాష్ట్రం కూడా కుదేలవడానికి కారణం ఏమిటి? రాజకీయ పార్టీలు బాధ్యతను విస్మరించి అధికారం కోసం పోటీపడుతూ... అపర దానకర్ణుల వలె ప్రజాధనాన్ని పప్పు బెల్లాల్లా పంచిపెట్టడానికి పోటీపడటంతో రెండు రాష్ట్రాలు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నాయి. సంక్షేమ పథకాలకు కూడా అప్పులు చేయవలసి వస్తోంది. ప్రభుత్వ ఆస్తులను కుదువ పెట్టడమే కాకుండా, భవిష్యత్ ఆదాయాలను కూడా తాకట్టు పెట్టి అప్పులు చేసి సంక్షేమ పథకాలు అమలు చేయడం వల్లనే తెలుగు నాట ప్రస్తుత దుస్థితి దాపురించింది. ఏదో ఒక రాజకీయ పార్టీ అధికారంలోకి రావడం కోసం లేదా ఎవరో ఒకరు ముఖ్యమంత్రి కావడం కోసం సంక్షేమం పేరిట అలవికాని పథకాలను ప్రకటిస్తూ తెలుగు రాష్ట్రాలను దివాలా తీయిస్తున్నారు. కొంతమేరకు భారతీయ జనతా పార్టీని మినహాయిస్తే, మిగతా ప్రధాన రాజకీయ పార్టీలన్నింటికీ ఈ పాపంలో భాగం ఉంది. వివిధ ప్రభుత్వ శాఖలలో చేపట్టిన పనులకు చెల్లించాల్సిన బకాయిలు ఒక్కో రాష్ట్రంలో లక్ష కోట్లు దాటాయి. చివరికి పరిస్థితి ఎంతవరకూ వెళ్లిందంటే, నిర్దిష్టంగా నిధుల లభ్యత ఉన్న పనులకు మినహా మిగతా పనులు చేపట్టడానికి ప్రభుత్వాలు టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. దీంతో ప్రజలకు మౌలిక సదుపాయాలు కరువై అల్లాడుతున్నారు. ఆర్థిక పరిస్థితి దారుణంగా ఉందని తెలిసి కూడా కొత్త పథకాల ప్రకటనలో రాజకీయ పార్టీలు తగ్గేదేలే అన్నట్టుగా పోటీ పడుతున్నాయి.

11 ఏళ్ల క్రితం నిజంగానే రెవెన్యూ మిగులుతో ధనిక రాష్ట్రంగా ఉండిన తెలంగాణలో ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన కేసీఆర్ అనేక సరికొత్త సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టి అమలు చేశారు. దీంతో అభివృద్ధి పనులకు అప్పులు చేయాల్సిన పరిస్థితిలోకి తెలంగాణ వెళ్లింది. ఎన్నికల్లో ప్రయోజనం పొందడమే పరమావధిగా సంక్షేమ పథకాలను జనంలోకి వదిలారు. హుజూరాబాద్‌కు జరిగిన ఉప ఎన్నికలో ఈటల రాజేందర్‌ను ఓడించేందుకు కేసీఆర్ 'దళితబంధు' పథకానికి రూపకల్పన చేశారు. ఈ పథకం కింద ఎంపిక చేసిన దళిత కుటుంబాలకు పది లక్షల రూపాయల వంతున పంచిపెట్టారు. అయినా ఆ ఉప ఎన్నికలో అధికార బీఆర్ఎస్ ఓడిపోయి ఈటల రాజేందర్ గెలిచారు. ఆ తర్వాత 'దళిత బంధు' పథకం కూడా అటకెక్కింది. దళితులకేనా 'బంధు'... మాకివ్వరా? అని మిగతా వర్గాల ప్రజలు అలకబూనారు. దీంతో కేసీఆర్ పరిస్థితి ఉభయ భ్రష్టత్వం అయింది. అభివృద్ధి పనులకు అవసరమైన నిధుల కోసం హైదరాబాద్‌లోని ప్రభుత్వ భూములను కూడా ఎడా పెడా అమ్మేశారు. అయినా రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోతూనే ఉంది. ఈ దశలో ఎన్నికలు రావడం, ఎలాగైనా అధికారంలోకి రావాలన్న పట్టుదలతో కాంగ్రెస్ పార్టీ కూడా గ్యారెంటీల పేరుతో సరికొత్త హామీలు ఇచ్చింది. కారణాలు ఏమైనా, 2023 ఎన్నికల్లో కేసీఆర్ పార్టీ ఓడిపోయి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ముఖ్యమంత్రి పీఠంపై కూర్చున్నాక రేవంత్ రెడ్డికి తత్వం బోధపడటం మొదలైంది. రైతు రుణ మాఫీ కోసం దాదాపు పాతిక వేల కోట్ల రూపాయలు పంచిపెట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ ప్రయోజనం పొందకపోగా... కేసీఆర్ ప్రారంభించిన పథకాలకు నిధులు సమకూర్చలేక గుడ్లు తేలేసింది. దీంతో ప్రభుత్వం అప్పుల వేటకు బయలుదేరింది.

### ఏపీలో ఆపసోపాలు...

తోటి వాడు తొడ కోసుకుంటే తాను మెడ కోసుకున్నట్టుగా ఆంధ్రప్రదేశ్‌లో కూడా సంక్షేమ పథకాల జాతరకు తెర లేపారు. అప్పట్లో ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణలో ప్రారంభమైన అనేక పథకాలను ఆంధ్రప్రదేశ్‌లో కూడా అమలు చేసేందుకు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు ఆపసోపాలు పడ్డారు. మొత్తానికి ముక్కుతూ మూలుగుతూ ఐదేళ్ల కాలం పూర్తయింది. ఎన్నికలు వచ్చి పడటంతో వృద్ధాప్య పింఛన్లను చంద్రబాబు రెండు వేలకు పెంచారు. అంతటితో ఆగకుండా 'పసుపూ కుంకుమ' పేరిట డ్వాక్రా మహిళలకు పదివేల రూపాయల వంతున పంచిపెట్టారు. చంద్రబాబు అధికారం కోల్పోకుండా ఇలాంటి పథకాలు అడ్డుకోలేక పోయాయి. 2014లో తాము అధికారంలోకి వచ్చినట్టేనన్న అతి విశ్వాసంతో ఉండి బోర్లాపడిన జగన్మోహన్ రెడ్డి... 2019 ఎన్నికల్లో మాత్రం చాన్స్ మిస్ కాకూడదని భావించి 'నవరత్నాలు' పేరిట సరికొత్త పథకాలను ప్రకటించారు. అనూహ్యంగా 151 సీట్లతో అధికారంలోకి వచ్చారు. ఇచ్చిన హామీలు నెరవేర్చడానికి ఆయన ఎన్నో పిల్లిమొగ్గలు వేశారు. ఐదేళ్లలో సంక్షేమ పథకాల పేరిట దాదాపు రెండున్నర లక్షల కోట్లు పంచారు. ఈ డబ్బు సమకూర్చుకునేందుకు భవిష్యత్తులో వచ్చే ప్రభుత్వ ఆదాయాన్ని తాకట్టు పెట్టారు. ప్రభుత్వ ఆస్తులను, కార్యాలయాలను కూడా కుదువ పెట్టి అప్పు చేశారు. తన చేతికి ఎముక లేదని, తాను పేదల పెన్నిధినని, అపర దానకర్ణుడినని చెప్పుకొచ్చారు. ఐదేళ్లు గడచిపోయాయి. అన్ని సంక్షేమ పథకాలు అమలు చేసినా, బటన్లు నొక్కినా 2024 ఎన్నికల్లో జగన్‌రెడ్డికి 11 సీట్లు మాత్రమే వచ్చాయి. తెలంగాణలో కేసీఆర్‌ను గానీ, ఆంధ్రప్రదేశ్‌లో జగన్‌రెడ్డిని గానీ సంక్షేమ పథకాలు కాపాడలేదు. ఈ వాస్తవాన్ని విస్మరించిన ఆంధ్రప్రదేశ్ ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 2024లో 'సూపర్ సిక్స్' పేరిట సరికొత్త హామీలు ఇచ్చారు. 'అమ్మ ఒడి' స్థానంలో తీసుకు వచ్చిన 'తల్లికి వందనం' పథకం కింద ఒక కుటుంబంలో ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికీ సాలీనా 15 వేల రూపాయల వంతున పంచుతామని ప్రకటించారు. వృద్ధాప్య పెన్షన్ల మొత్తాన్ని ఏకంగా నాలుగు వేలకు పెంచారు. దేశంలో మరే రాష్ట్రంలో కూడా, ఆర్థికంగా అంతో ఇంతో పటిష్ఠంగా ఉన్న తమిళనాడులో కూడా పెన్షన్లు నాలుగు వేలు లేవు. ఇదే కాకుండా మహిళలకు ఏటా 15 వేల వంతున ఇస్తామన్నారు. ఇది ఇంకా అమలు కాలేదు. అమలు అవుతుందన్న గ్యారెంటీ కూడా లేదు. సూపర్ సిక్స్‌లో మిగతా వాటిని ముక్కీ మూలిగి అమలు చేస్తున్నారు. ఆటో డ్రైవర్లకు ఏటా 15 వేల వంతున పంచుతామంటున్నారు. జగన్‌రెడ్డి లిక్కర్ భవిష్యత్ ఆదాయాన్ని కుదువపెట్టగా, చంద్రబాబు అదే బాటలో గనుల ఆదాయాన్ని కుదువపెట్టారు. తమాషా ఏమిటంటే, కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెడుతున్నారని కాంగ్రెస్ పార్టీ ఆరోపించగా, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పులపాలు చేస్తోందని బీఆర్ఎస్ విమర్శిస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో కూడా నాడు జగన్మోహన్ రెడ్డి పది లక్షల కోట్లు అప్పులు చేశారని తెలుగుదేశం పార్టీ విమర్శించగా, ఇప్పుడు కూటమి ప్రభుత్వం చేస్తున్న అప్పులు చూసి జగన్ అండ్ కో గుండెలు బాదుకుంటున్నారు. ప్రభుత్వాలకు ఆదాయం ఇబ్బడి ముబ్బడిగా పెరిగి నిధులు మూలుగుతుంటే ప్రజలకు పంచి పెట్టడంలో తప్పు లేదు. అభివృద్ధి చెందిన కొన్ని దేశాలలో పన్ను చెల్లింపుదారులు సీనియర్ సిటిజన్లయ్యాక వారు చెల్లించిన సొమ్ములో కొంత మొత్తాన్ని వృద్ధాప్యంలో పెన్షన్ రూపంలో తిరిగి చెల్లిస్తారు. మన దేశంలో ఈ వెసులుబాటు లేదు. ఏదైనా కంపెనీ లాభాలు గడిస్తే పన్నులు చెల్లిస్తూనే ఉండాలి. అదే కంపెనీ కర్మకాలి నష్టాల్లోకి వెళితే ప్రభుత్వాలుగానీ, ఆర్థిక సంస్థలు గానీ ముఖం కూడా చూడవు. వ్యక్తిగతంగా ఆదాయపు పన్ను చెల్లించిన వారిని కూడా వృద్ధాప్యంలో ప్రభుత్వాలు ఆదుకోవు. పన్ను చెల్లింపుదారుల జాబితాలో ఉన్నందువల్ల ప్రభుత్వాలు అమలు చేస్తున్న పెన్షన్ వంటి సంక్షేమ పథకాలు కూడా వారికి వర్తించవు.

రేషన్ బియ్యమే దిక్కా? ఇప్పుడు మళ్లీ తెలుగు రాష్ట్రాల విషయానికి వద్దాం! ఇటు తెలంగాణ, అటు ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిపథంలో దూసుకుపోతున్నాయని ఆయా ప్రభుత్వాలు ప్రకటిస్తున్నాయి. అలాంటప్పుడు పేదరికం తొలగిపోవాలి కదా? అయితే మన రాజకీయ పార్టీల స్వార్థం వల్ల పేదల సంఖ్య కూడా ఎప్పటికప్పుడు పెరుగుతోంది. ఎన్టీఆర్ వైద్యసేవ (ఆరోగ్యశ్రీ), ఫీజు చెల్లింపు వంటి పథకాలకు తెల్ల రేషన్ కార్డుతో ముడిపెట్టడం ప్రభుత్వాలు చేస్తున్న అతి పెద్ద తప్పిదం. ఈ కారణంగా ప్రభుత్వ ఉద్యోగులు మినహా మిగతా వారందరూ తెల్ల రేషన్ కార్డులు సొంతం చేసుకుంటున్నారు. ఆహార భద్రత కార్డులు పొందడానికి కేంద్ర ప్రభుత్వం రూపొందించిన మార్గదర్శకాలను రెండు తెలుగు రాష్ట్రాలలో అమలు చేయడం లేదు. తెలంగాణ జనాభా మూడున్నర కోట్లు కాగా ఆహార భద్రతా కార్డులు, అంటే తెల్ల రేషన్ కార్డుల వల్ల లబ్ధి పొందుతున్న వారి సంఖ్య 3 కోట్ల 25 లక్షలు. ఇప్పుడు తెలంగాణలో 1,01,22,324 తెల్ల కార్డులు ఉన్నాయి. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం మరో రెండున్నర లక్షల కార్డులు జారీ చేయబోతున్నది. దీంతో తెల్ల రేషన్ కార్డుల లబ్ధిదారుల సంఖ్య 3 కోట్ల 35 లక్షలకు పెరుగుతుంది.

# వరద బాధితులకు సాయం

## అందించడంలో ప్రభుత్వం విఫలం:

మొదటిపేజీ తరువాయి
సీఎం వైఖరి ఆయన హోదాను తగ్గించే విధంగా ఉందన్నారు. బాధితులకు ఆర్థిక సాయం, నిత్యావసర సరకులు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. నాలాల పూడికతీత పనులు చేపట్టాలని కోరారు.
కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎమ్మెల్యేల అంశంపై హరీశ్‌రావు స్పందించారు. బహిరంగంగా కాంగ్రెస్ కండువా మార్చుకుని పార్టీ మారలేదని చెప్పడం సిగ్గుచేటన్నారు. బతుకమ్మ పండుగ నేపథ్యంలో ప్రభుత్వం నిధులు విడుదల చేసి మౌలిక వసతులు కల్పించాలని కోరారు. పంచాయతీలకు నిధులు లేక గ్రామాల్లో పాలన కుంటుపడిందని విమర్శించారు.

# దిల్లీ వెళ్లి ఆల్మట్టి డ్యామ్‌పై వాదనలు వినిపిస్తాం: మంత్రి ఉత్తమ్

మొదటిపేజీ తరువాయి
ఈ సందర్భంగా ఉత్తమ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. రేపు దిల్లీ వెళ్లి ఆల్మట్టి డ్యామ్‌పై వాదనలు వినిపిస్తామన్నారు. భారత రాష్ట్ర సమితి పాలనలో కూలిపోయే కాళేశ్వరం కట్టారని చెప్పారు. దీనిపై విచారణ జరుగుతోందని.. అది పూర్తయిన తర్వాత చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. కృష్ణా నది జలాల్లో తెలంగాణ వాటా సాధించి తీరుతామని తెలిపారు.

# గాజుల రామారంలో..

## కబ్జా చేసినవారిలో నేతలు, ఉన్నతాధికారులు: హైడ్రా కమిషనర్

మొదటిపేజీ తరువాయి
అధికారులతో స్థానిక నేతలు కుమ్మక్కై పేదలకు స్థలాలు విక్రయించారని పేర్కొన్నారు. 6 నెలల్లో ఐదుసార్లు స్థానికులతో హైడ్రా, రెవెన్యూ అధికారులు మాట్లాడారన్నారు. కబ్జాలను తొలగించి ప్రభుత్వ భూములను వెనక్కి తీసుకుంటున్నట్లు వివరించారు.
100 ఎకరాలకుపైగా కబ్జా.. గాజుల రామారంలో హైడ్రా కూల్చివేతలు
"పేదలు నివసిస్తున్న ప్రాంతాలను హైడ్రా తొలగించట్లేదు. వాణిజ్య షెడ్లు, కాంపౌండ్ గోడలు, గదులు నిర్మించిన వాటిని తొలగిస్తాం. కబ్జాదారుల నుంచి ప్రభుత్వ భూమిని వెనక్కి తీసుకుని కంచె ఏర్పాటు చేస్తాం. రూ.13 వేల కోట్ల విలువైన 275 ఎకరాలకు పైగా భూమిని స్వాధీనం చేసుకుంటాం" అని రంగనాథ్ తెలిపారు.

# మీతో కలిసి నడుస్తా..

## మీకు అండగా ఉంటా: మంత్రి వివేక్

మొదటిపేజీ తరువాయి
ఈ సందర్భంగా మంత్రి వివేక్ మాట్లాడుతూ.. మూడు నాలుగు రోజులకు ఒకసారి ఇదే షేక్ పేట్ రోడ్డులో వెళ్తుంటానని.. ఇక్కడి సమస్యలు అన్ని తనకు తెలుసన్నారు. ప్రజలు తమ దృష్టికి తీసుకువచ్చిన పనుల గురించి జీహెచ్ఎంసీ జోనల్ అధికారిని పిలిచి మాట్లాడుతానని హామీ ఇచ్చారు. షేక్ పేట్?లో చాలా స్లమ్ ఏరియాస్ ఉన్నాయని.. ఇక్కడ ఎక్కువగా పేద ప్రజలు ఉంటారన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని ఒక్కో డివిజన్ అభివృద్ధికి 20 కోట్ల రూపాయలు కేటాయించామని తెలిపారు.

# 'కౌన్ బనేగా కరోడ్‌పతి'..

## రూ.50లక్షలు గెలుచుకున్న కార్పెంటర్



జలంధర్: బాలీవుడ్ నటుడు అమితాబ్ బచ్చన్ వ్యాఖ్యాతగా వ్యవహరించే 'కౌన్ బనేగా కరోడ్‌పతి ' ఇటీవల షోలో పంజాబ్‌లోని జలంధర్‌కు చెందిన ఓ యువకుడు స్థానికంగా అరుదైన ఘనత సాధించాడు. వడ్రంగి వృత్తిలో ఉన్న అతను వ్యూహాత్మకంగా వ్యవహరించి రూ.50లక్షలు గెలుచుకున్నాడు. తన కుటుంబంతోపాటు గ్రామస్థులతో ఔరా అనిపించుకున్నాడు. జలంధర్‌లోని హుస్సేన్‌పుర్‌కు చెందిన చందర్‌పాల్ ఓ కార్పెంటర్.. చిన్నప్పటి నుంచి కష్టపడేతత్వం. జీవితంలో ఏదైనా సాధించాలనే తపన, పట్టుదలతో ఉండేవాడు. సాధారణ విద్య అభ్యసించినప్పటికీ వివిధ అంశాలపై విషయ పరిజ్ఞానం పెంచుకునేందుకు ప్రయత్నించేవాడు. కేబీసీలో అడుగుపెట్టాలని ఐదేళ్లుగా ప్రయత్నించి చివరకు హాట్‌సీట్‌ను చేరుకొని తన కల సాకారం చేసుకున్నాడు. అక్కడ ఎదురైన కఠిన ప్రశ్నలకు ఆడియన్స్ పోల్, 50-50 వంటి లైఫ్‌లైన్లను వాడుకొని రూ.50లక్షలను కైవసం చేసుకున్నాడు.
కేబీసీ కోసం ప్రయత్నిస్తున్నట్లు ఎవరికీ చెప్పలేదని, తెలిస్తే ప్రతికూలంగా స్పందిస్తారనే భయంతో రహస్యంగా చదివే వాడినని చందర్‌పాల్ వివరించాడు. ఇక్కడకు వచ్చేవారిలో అనేకమంది ఉన్నత విద్యావంతులు ఉన్నారని, కానీ, తనలాంటి వారికి కూడా అవకాశం లభించడం గొప్ప విషయమన్నారు. తనకు వచ్చిన ఈ డబ్బును పిల్లల చదువుతోపాటు తన వ్యాపార విస్తరణకు ఉపయోగిస్తానన్నాడు. ఆత్మవిశ్వాసం ఉంటే ఏదైనా సాధ్యమేనని చెబుతున్న చందర్‌పాల్ మాటలు ఎంతోమంది యువతకు స్ఫూర్తిని కలిగిస్తున్నాయి.

# అమ్మవారికి ఒక్కరోజే పూజలు..

## ఇక్కడ దసరా వేడుకలు ప్రత్యేకం!

ఆసన్‌సోల్: దసరా శరన్నవరాత్రుల్లో అమ్మవారిని భక్తిశ్రద్ధలతో పూజిస్తుంటారు. కానీ, పశ్చిమ బెంగాల్‌లోని ఓ ఆశ్రమంలో మాత్రం ఒక్కరోజులోనే ఈ వేడుకలు ముగుస్తాయి. ఆసన్‌సోల్‌లోని ధేనువా గ్రామంలో తేజానంద బ్రహ్మచారి అనే సాధువు 1937లో దామోదర్ నది తీరాన కాళీకృష్ణ ఆశ్రమాన్ని స్థాపించారు. 1979లో ఆయనకు అమ్మవారు కలలోకి వచ్చారట. అప్పటినుంచి.. మహాలయ అమావాస్య రోజే దుర్గా విగ్రహానికి సప్తమి, అష్టమి, నవమి, దశమి పూజలు నిర్వహించడం ప్రారంభమైంది.
ఆ రోజు నవపత్రిక (తొమ్మిది రకాల పత్రాలు)ను పవిత్ర జలాలతో అభిషేకించి విగ్రహం ముందు ఉంచి, పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఇక్కడ కేవలం జయ, విజయలతో కూడిన అమ్మవారి విగ్రహాన్ని మాత్రమే ప్రతిష్ఠిస్తారు. పూజల అనంతరం నవపత్రికను నిమజ్జనం చేస్తారు. దర్శనం కోసం స్థానికుల విజ్ఞప్తి మేరకు విగ్రహాన్ని మాత్రం అక్కడే ఉంచుతారు. కానీ, ఎటువంటి పూజలు చేయరు. ధేనువాతోపాటు సమీప గ్రామాలు, బంకుడా, పురులియా వంటి జిల్లాల నుంచి వేలాది మంది భక్తులు ఈ వేడుకలకు తరలివస్తారు.

# దేశ ప్రజలకు ప్రధాని గుడ్ న్యూస్..

మొదటిపేజీ తరువాయి

సంస్కరణలతో పెట్టుబడుల ప్రవాహం పెరుగుతుందని, అదే విధంగా దేశ ప్రజల పొదుపు కూడా పెరుగుతుందని మోదీ చెప్పారు. అన్ని రాష్ట్రాలతో చర్చించిన తర్వాతే ఇంత పెద్ద సంస్కరణలు తీసుకువచ్చామని వివరించారు. దేశంలో కొత్త మధ్యతరగతి వర్గం పెరుగుతోందని, వారికి ఇది ప్రోత్సాహకరంగా ఉంటుందని చెప్పారు. పర్యాటక రంగానికి జీఎస్టీ సంస్కరణలు ఎంతో మేలు చేస్తాయని చెప్పారు. హెూటల్స్ సేవలపైనా జీఎస్టీ తగ్గించామని తెలిపారు. సంస్కరణలు సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు ఊతమిస్తాయని చెప్పారు. జీఎస్టీ తగ్గింపులతో ఎంఎస్ఎంఈలు లాభపడతాయన్నారు.
మేడిన్ ఇండియా ఉత్పత్తులే వాడాలి
ప్రధాని మంత్రి ఈ సందర్భంగా మరోసారి మేడిన్ ఇండియా ఉత్పత్తులే వాడాలని ప్రజలకు పిలుపునిచ్చారు. దేశం సమృద్ధిగా ఉండాలంటే దేశీయ ఉత్పత్తులే వాడాలని సూచించారు. మన ఉత్పత్తుల నాణ్యత దేశ గౌరవాన్ని మరింత పెంచుతోందని, నాగరిక్ దేవోభవ అనే మంత్రంతో ముందుకు సాగుతున్నామని చెప్పారు.

# వెయ్యి స్తంభాల గుడిలో

## బతుకమ్మ ఉత్సవాలు ప్రారంభం

మొదటిపేజీ తరువాయి

తెలంగాణ ఉద్యమంలో అందరినీ ఏకం చేసింది బతుకమ్మ పండుగ అని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. 'గతంలో మన సంస్కృతిని గుర్తించలేదు, ధ్వంసం చేశారు. బతుకమ్మకు రెండు వందల ఏళ్ల చరిత్ర ఉంది' అని జూపల్లి తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వాన్ని మహిళలు దీవించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కోరారు. మహిళలందరికీ బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఘనంగా బతుకమ్మ ఉత్సవాలు నిర్వహిస్తోందని తెలిపారు.ఏడాదికొకసారి వచ్చే బతుకమ్మకు చాలా చరిత్ర ఉందని మంత్రి సీతక్క అన్నారు. 'కాకతీయుల కాలం నుంచి బతుకమ్మ పండుగ జరుపుకుంటున్నాం. చెరువులకు మొక్కుకునే ఆనవాయితీ మనది. ఆడబిడ్డలు కష్టసుఖాలు పంచుకునే సందర్భం బతుకమ్మ. మన పండుగలకు సైంటిఫిక్ రీజన్ ఉంది. పూర్వీకులు ఇచ్చిన ఆచారాలు, సంప్రదాయాలు కాపాడుకుందాం' అని సీతక్క అన్నారు.తెలంగాణ పచ్చగా ఉండాలని మహిళలు దీవించాలని మంత్రి కొండా సురేఖ కోరారు. కనివిని ఎరుగని రీతిలో బతుకమ్మ సంబరాలు నిర్వహిస్తున్నామని మంత్రి చెప్పారు. ఈ సందర్భంగా కొండా సురేఖ 'చిత్తూ చిత్తూల బొమ్మ' అంటూ బతుకమ్మ పాట పాడగా.. మంత్రి సీతక్క, ఎంపీ కావ్య, మేయర్ గుండు సుధారాణి, గద్దర్ కూతురు వెన్నెల, మహిళలు కోరస్ ఇచ్చారు.

# నా ఫ్యామిలీపై కుట్రలు చేసినోళ్లను వదలిపెట్టా..

## భరతం పడతా: ఎమ్మెల్సీ కవిత

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: బతుకమ్మ పండుగ వేళ ఎమ్మెల్సీ కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. నా ఫ్యామిలీపై కుట్రలు చేసినోళ్లను వదలిపెట్టనని.. భవిష్యత్?లో వాళ్ల భరతం పడతానని హెచ్చరించారు. కేసీఆర్ స్వగ్రామం చింతమడకలో ఆదివారం (సెప్టెంబర్ 21) జరిగిన ఎంగిల పూల బతుకమ్మ వేడుకల్లో కవిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమెకు డప్పు చప్పుళ్లు, మంగళ హారతులతో ఘన స్వాగతం పలికారు గ్రామస్థులు, మహిళలు.
చింతమడక గ్రామ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు చిన్నారామ్ ముత్యం ఇంట్లో తోటి మహిళలతో కలిసి పాటలు పాడుతూ కవిత బతుకమ్మను పేర్చారు. అనంతరం మహిళలు, గ్రామస్తులతో కలసి బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. చింతమడక ఇచ్చిన ధైర్యంతో తెలంగాణ ఉద్యమ సమయంలో రాష్ట్రమంతా తిరిగానని గుర్తు చేసుకున్నారు. కుటుంబానికి దూరమైన బాధలో ఉన్న నాకు చింతమడక అండగా నిలిచిందని కవిత భావోద్వేగానికి గురయ్యారు. ప్రత్యేక పరిస్థితుల్లోనూ తనను ఆదరించారని చింతమడక గ్రామ ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. ఇవాళ సిద్దిపేట రావాలంటే కేజీఎఫ్?లోకి వెళ్లినట్లు ఆంక్షలు పెడుతున్నారని కానీ ఇక్కడ ఎవరి ఆంక్షలు పని చేయవని హాట్ కామెంట్ చేశారు. కొంతమంది సిద్దిపేట, చింతమడకను సొంత ఆస్తిలా చూస్తున్నారు. కానీ ఏ ఊరు.. ఎవ్వరి జాగీరు కాదు. మళ్లీ మళ్లీ సిద్దిపేట, చింతమడకకు వస్తా. ఆంక్షలు పెడితే ఇంకా ఎక్కువగా వస్తానని హెచ్చరించారు కవిత. నన్ను నా కుటుంబానికి దూరం చేశారు.. నా కుటుంబంపై కుట్రలు చేసిన వాళ్లను వదలిపెట్టనని అన్నారు. చంద్రుడి లాంటి కేసీఆర్?కి కూడా మచ్చ తెచ్చారని ఫైర్ అయ్యారు. బతుకమ్మ పండగ వేళ కేసీఆర్ సొంతూర్?లో కవిత చేసిన వ్యాఖ్యలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. బీఆర్ఎస్ కీలక నేత హరీష్ రావును ఉద్దేశించే కవిత పరోక్షంగా విమర్శలు చేసినట్లు ప్రచారం జరుగుతోంది.

# హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం

మొదటిపేజీ తరువాయి
హైదరాబాద్: నగరంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం భారీ వర్షం కురిసింది. ఎల్బీనగర్, నాగోల్, మన్సూరాబాద్, వనస్థలిపురం, హయత్‌నగర్, పెద్ద అంబర్‌పేట, రామోజీ ఫిల్మ్‌సిటీ పరిసర ప్రాంతాల్లో కురిసిన వర్షానికి వాహనదారులు, ప్రయాణికులు అవస్థలు పడ్డారు. హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై పలు చోట్ల వర్షపు నీరు చేరడంతో వాహనాల రాకపోకలు నెమ్మదిగా సాగుతున్నాయి.రాగల 3 రోజులు తెలంగాణలోని కొన్ని జిల్లాల్లో అక్కడక్కడా ఉరుములు మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. అదే సమయంలో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని వెల్లడించింది. ఈనెల 25 నాటికి తూర్పు మధ్య బంగాళాఖాతం దాని సమీపంలోని ఉత్తర బంగాళాఖాతం ప్రాంతంలో ఒక అల్పపీడన ప్రాంతం ఏర్పడే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం సంచాలకులు విడుదల చేసిన ప్రకటనలో స్పష్టం చేశారు. ఆ అల్పపీడనం దక్షిణ ఒడిశా.. ఉత్తరాంధ్ర కోస్తా తీరం సమీపంలో ఈనెల 26 నాటికి వాయుగుండంగా బలపడే అవకాశం ఉందని తెలిపారు. ఈనెల 27 నాటికి అదే ప్రాంతంలో వాయుగుండం తీరం దాటే అవకాశం ఉందని వివరించారు.

# ఇదే నా మరణ వాంగ్మూలం.. మాజీ డీఎస్పీ నళిని బహిరంగ లేఖ

మొదటిపేజీ తరువాయి
భువనగిరి: తెలంగాణ ఉద్యమ సమయంలో రాజీనామా చేసిన డీఎస్పీ నళిని రాష్ట్ర ప్రజలకు రాసిన బహిరంగ లేఖ సంచలనంగా మారింది. 'మరణ వాంగ్మూలం' అంటూ ఫేస్‌బుక్‌లో ఆమె పోస్టు చేశారు. తన ఆరోగ్య పరిస్థితి నెల రోజులుగా ఆందోళనకరంగా ఉందని, రుమటాయిడ్ ఆర్థ్రైటిస్‌తో తీవ్రంగా ఇబ్బంది పడుతున్నానని లేఖలో పేర్కొన్నారు. " నా జీవితం ముగియబోతోంది. సాయం కోసం నేను సీఎంకు పెట్టిన దరఖాస్తు బుట్టదాఖలైంది. ఇప్పటి వరకు నన్ను ఏ నాయకుడూ సన్మానించలేదు. నేను చనిపోయాక రాజకీయ లబ్ధి కోసం నా పేరు వాడుకోవద్దు. ప్రధాని మోదీని కలవలేకపోయాను. నా మరణానంతరం నా లక్ష్య సాధన కోసం మోదీ ఏమైనా చేయాలి. నేను స్థాపించిన వేదామృతం ట్రస్టుకు సాయం చేయాలి. వచ్చే జన్మలో మోక్ష సాధన కోసం ప్రయత్నిస్తా." అని నళిని తన లేఖలో పేర్కొన్నారు.

# గాజులరామారంలో హైడ్రా కూల్చివేతలు, ఉద్రిక్తత



**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**
హైదరాబాద్‌లోని గాజులరామారంలో హైడ్రా కూల్చివేతలు మరోసారి తీవ్ర ఉద్రిక్తతలకు దారితీశాయి. స్థానికులు తమ ఇళ్ల కూల్చివేతలను వ్యతిరేకిస్తూ ఆందోళన చేపట్టారు. కొనుక్కున్న ఇళ్లను కూల్చవద్దని బాధితులు వేడుకుంటున్నారు. బతుకమ్మ పండుగ వేళ ఇళ్లను కూల్చివేయడంపై వారు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. జేసీబీలను అడ్డుకుని ధర్నా చేసిన బాధితులు, ఇళ్లను అమ్మిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కొందరు బాధితులు కన్నీటి పర్యంతమయ్యారు. హైడ్రా కూల్చివేతల ప్రాంతంలో బతుకమ్మ ఆడుతూ నిరసన తెలిపారు.

## భార్య మందలించిందని భర్త ఆత్మహత్య



**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**
మేడ్చల్ జిల్లా బాలానగర్‌లో విషాదం ఘటన చోటు చేసుకుంది. మెదక్ జిల్లా కౌడిపల్లికి చెందిన వడ్డే సంతోష్ (23) స్థానికంగా కుటుంబంతో నివాసం ఉంటున్నాడు. మద్యానికి బానిసవ్వడంతో అతడి భార్య శ్రుతి మందలించింది. దీంతో ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం గాంధీ ఆస్పత్రికి తరలించారు.

## చిన్నక్రాంతి కాలనీలో సీసీకెమెరాలు



- ప్రారంభించిన మేడిపల్లి సీఐ

**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**
మేడిపల్లి సీఐ గోవింద్ రెడ్డి మాట్లాడుతూ, ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానమని, కెమెరా అబద్ధం చెప్పదని, దానికి కుల, మత, ప్రాంతీయ బేధాలు లేకుండా నిజాలే చెబుతుందని, రెప్పవాల్చకుండా పనిచేస్తుందని తెలిపారు. బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని చిన్న క్రాంతి కాలనీలో దాత గొరిగే రాధిక నరసింహ కురుమ సహకారంతో సీసీ కెమెరాల ప్రారంభోత్సవ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్, కాంగ్రెస్ నాయకులు, చిన్న క్రాంతి కాలనీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## బోడుప్పల్ సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శ్రీకారం



**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**
బోడుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని 1వ డివిజన్ ద్వారకానగర్ ఫేజ్-2లో సీసీ రోడ్ల నిర్మాణ పనులు శనివారం ప్రారంభమయ్యాయి. మాజీ కార్పొరేటర్ శ్రీ బింగి జంగయ్య యాదవ్ గారు కొబ్బరికాయ కొట్టి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో ద్వారకానగర్ కమిటీ సభ్యులు, స్థానిక కాలనీ ప్రజలు పాల్గొని హర్షం వ్యక్తం చేశారు.

## కొండా లక్ష్మణ్ బాపూజీకి ఘనంగా నివాళులు



**గాజెంగి మహేశ్వర్, కరపత్రం ప్రతినిధి**
మెట్ పల్లి పట్టణంలో ఆదివారం, మెట్ పల్లి పద్మశాలి సంఘం అధ్యక్షులు ధ్యావన పెల్లి రాజారాం ఆధ్వర్యంలో స్వతంత్ర సమరయోధుడు, తెలంగాణ పోరాట వీరుడు కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. పాత బస్టాండ్ వద్ద ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు రాజారాం మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర సాధనలో కొండా లక్ష్మణ్ బాపూజీ పోషించిన పాత్ర విశిష్టమైనదని, ఆయన చివరి శ్వాస వరకు చిత్తశుద్ధితో కృషి చేశారని కొనియాడారు.

# నగునూర్ దుర్గాభవానీ ఆలయంలో నవరాత్రోత్సవాలు.





**కరపత్రం ప్రతినిధి కరీంనగర్ సెప్టెంబర్ 21**
**విద్యుద్దీపాల కాంతుల్లో దుర్గాభవానీ ఆలయం.**
**ఆలయంలో కొలువైఉన్న దుర్గాభవానీ అమ్మవారు.**
**నవరాత్రోత్సవాల కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటి బాధ్యులు**

త్రిమూర్తులకు శక్తి ప్రదాత. త్రిలోకేశ్వరి సకలాభీష్ట ప్రదాయిని శ్రీదుర్గాభవానీ శరన్నవరాత్రోత్సవాలు కరీంనగర్ నగునూర్‌లోని శ్రీ దుర్గాభవానీ ఆలయంలో సోమవారం నుండి అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ఫౌండర్ చైర్మెన్ వంగల లక్ష్మన్ తెలిపారు. ఆదివారం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దక్షిణామ్నాయ శృంగేరీ శారదా పీఠం ఆధ్వర్యంలో కొనసాగుతున్న పరివార సమేత శ్రీ దుర్గాభవానీ ఆలయంలో నిర్వహిస్తున్న నవరాత్రులలో భాగంగా 22 సోమవారం ఉదయం గురు వందనం, గోపూజ, పుణ్యాహవాచనం, గ్రహారాధన, కలశస్థాపన, చండీపారాయణ చతుష్షష్ట్యుపచారపూజ, చండీహెూమం, మంగళహారతి, కన్యాసువాసినీ పూజలు జరుగుతాయని ఆయన తెలిపారు. అమ్మవారు బ్రహ్మీ అలంకరణలో హంస వాహనంపై భక్తులకు దర్శనమిస్తారని ఆయన వివరించారు.

సాయంత్రం బతుకమ్మ, పల్లకీ సేవ, కోలాటం, రాజోపచార పూజలు జరుగుతాయని ఆయన తెలిపారు. ఈ ఉత్సావాలలో భాగంగా ప్రతి రోజు ఉదయం సాయంత్రం గంగా హారతి ఉంటుందన్నారు. 23న మహేశ్వరీ అలంకరణలో నంది వాహనంతో, 24న కౌమరీ అలంకరణలో నెమిలి వాహనంతో, 25న వైష్టనీ అలంకరణలో గరుడ వాహనంతో, 26న లలిత త్రిపుర సుందరిగా హంస వాహనంతో, 27న ఇంద్రాణి అలంకరణలో గజ వాహనంతో, 28న రాజరాజేశ్వరి అలంకరణలో, 29న సరస్వతీ అలంకరణలో హంస వాహనంతో, 30న దుర్గా అలంకరణలో సింహావాహనంతో, 1న అన్నపూర్ణ అలంకరణలో, 2న గురువారం విజయలక్ష్మి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారనిఆయన పెర్కొన్నారు, చండీహెూమం మహాపూర్ణాహుతి , సాయంత్రం దసరా వేడుకలు, జమ్మిపూజ, రాంలీల కార్యక్రమాలు జరుగుతాయని. 3వ తేదీ శుక్రవారం అర్ధనారీశ్వర అలంకరణలో నంది, సింహ వాహనలతో అమ్మవారు దర్శనమిస్తారని, ఉదయం 11 గంటలకు దుర్గాభవానీ సందరేశ్వరుల పట్టాభిషేకం, రథోత్సవం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో ఆలయ కమిటి బాధ్యులు వేములవాడ ద్రోణాచారి, నీరుమల్ల తిరుపతి, రాచమల్ల ప్రసాద్, పల్లెర్ల శ్రీనివాస్, తొడుపునూరి వేణుగోపాల్, రాచమల్ల రమేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గోన్నారు.

# సర్కారు వైద్యంపై ప్రజల్లో విశ్వాసం కల్పించాలి




- ప్రభుత్వం పేద ప్రజల ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇస్తుంది. కలెక్టర్ రాహుల్ రాజ్





**కరపత్రం ప్రతినిధి దినపత్రిక మెదక్ నర్సాపూర్**
సర్కారు దవాఖానాల్లో అందించే వైద్య సేవలపై ప్రజల్లో విశ్వాసం కల్పించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ సూచించారు.రామాయంపేట మండల పరిధిలో డి ధర్మారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆదివారం జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా పరిశీలించారు.ఈ సందర్భంగా ఆస్పత్రిలోని రక్త పరీక్షల గది, ఎక్స్ రే, ల్యాబ్ గదులను పరిశీలించారు. ఆస్పత్రికి వచ్చిన రోగులతో మాట్లాడి వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఎవరెవరు ఏ రుగ్మతతో వచ్చారని వాకబు చేశారు. ఆస్పత్రిలో జరిగిన ప్రసవాలు, ఇప్పటి వరకు జరిగిన ప్రసవాల వివరాలను చూశారు. మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ, చికెన్ గున్యా తదితర వ్యాధుల నమోదు,సాధారణ ప్రసవాలు, సిజరిన్ లు ఎన్ని జరిగాయని రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వసతి సౌకర్యాలతో పాటు, వైద్యులు అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించినప్పుడే ప్రభుత్వ లక్ష్యం నెరవేరినట్లు అవుతుందన్నారు.ప్రజారోగ్యం కాపాడటంలో వైద్యులు చిత్త శుద్ధితో వైద్య సేవలు అందించాలని సూచించారు.ప్రభుత్వం పేద ప్రజల ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇస్తూ పనిచేస్తుందని తెలిపారు. ఆసుపత్రిలో ఏవైనా సమస్యలు ఉంటే తెలపాలన్నారు.

# మాడ్రన్ కబడ్డీ జిల్లా అధ్యక్షుడిగా ఎర్రబెల్లి సంపత్ రావు

- మాడ్రన్ కబడ్డీ కరీంనగర్ జిల్లా నూతన కార్యవర్గం ఎంపిక





**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట సెప్టెంబర్ 21**
మాడ్రన్ కబడ్డీ రాష్ట అధ్యక్షులు కుంబం రాంరెడ్డి ఆదేశాల మేరకు ఆదివారం హుజూరాబాద్ లో కరీంనగర్ జిల్లా మాడ్రెన్ కబడ్డీ కార్యవర్గాన్ని రాష్ట్ర బాధ్యుడు,ఎన్నికల ఇన్చార్జి ఆరే తిరుపతి సమక్షంలో ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా ఎర్రబెల్లి సంపత్ రావు, ప్రధాన కార్యదర్శిగా మావునూరి అంజయ్య, ఉపాధ్యక్షులుగా సింగిరెడ్డి తిరుపతి రెడ్డి ,ఆర్గనైజింగ్ సెక్రటరీ గా బానోతు పరశురామ్,జాయింట్ సెక్రటరీ గా బుర్ర అజయ్, కోశాధికారిగా యేముల రవి కుమార్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తిరుపతి తెలిపారు.జిల్లా ఆధ్యకుడిగా ఎన్నికైన సంపత్ రావు మాట్లాడుతూ జిల్లాలో మాడ్రన్ కబడ్డీని విస్తరించడానికి, క్రీడాకారుల అభ్యున్నతి తనవంతు కృషి చేస్తానని స్పష్టం చేశారు.నూతనంగా ఎన్నికైన కమిటీకి రాష్ట్ర అధ్యక్షులు (ఫౌండర్) కుంభం రామ్ రెడ్డి మరియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతగింజల రాజారావు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుండి సుమారు 100 మంది కబడ్డీ క్రీడాకారులు పాల్గొన్నారు.

# ప్రజా పోరాటాలతోనే సమస్యలకు పరిష్కారం

- ఎన్నికల హామీలను విస్మరిస్తున్న పాలకులకు గుణపాఠం చెప్పాలి
- ఎంసిపిఐ(యు) లో చేరిన ప్రజాసంఘాల నాయకులు
- ఎంసిపిఐ(యు) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్





**కరపత్రం ప్రతినిధి**
చెన్నారావుపేట మండల కేంద్రంలో ఆదివారం ఎంసిపిఐ (యు) ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది.కామ్రేడ్ గోర్మియా అధ్యక్షతన కార్యక్రమానికి జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ హాజరై మాట్లాడుతూ, ఎన్నికల హామీలను విస్మరిస్తున్న పాలక పార్టీలకు ప్రజా ఉద్యమాలతోనే గుణపాఠం చెప్పాలని ఆయన అన్నారు.ఈ సందర్భంగా పార్టీలో చేరుతున్న ప్రజాసంఘాల నాయకులు జన్ను రమేష్ అబ్బదాసి అశోక్ ముర్రి శ్రీనులకు ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.అనంతరం పెద్దారపు రమేష్ మాట్లాడుతూ ఎన్నో ఆశలతో సాధించుకున్న రాష్ట్రంలో ప్రజా సమస్యలకు పరిష్కారం లేకపోగా అప్పుల కుప్పగా మారిందని ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అందని ద్రాక్షగా మారాయని గత ప్రభుత్వాల వైఫల్యాలని ఎత్తిచూపుతూ పబ్బం గడుపుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో రైతాంగం ఆరుగాలం కష్టించి అప్పులు తెచ్చి పెట్టుబడి పెట్టిన సరైన విధంగా ఎరువులు అందించకపోవడం, ప్రకృతి వైపరీత్యాలు సైతం సహకరించక రైతుల పరిస్థితి అగమ్య గోచరంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక సంస్థలకు సకాలంలో ఎన్నికలు నిర్వహించకపోవడం వల్ల ఎక్కడి సమస్యలు అక్కడే పేరుకుపోయి ప్రజల అవస్థలు పడుతున్నారని అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని గొప్పగా చెప్పి ఆచరణలో కొద్దిమందికే ఇస్తూ చేతులు దులుపుకుంటున్నారని ఇలాంటి పరిస్థితుల్లో సమస్యల పరిష్కారానికి ప్రజలను చైతన్యపరిచి ఉద్యమాలను నిర్మించాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో ఐక్య ప్రజానాట్య మండలి రాష్ట్ర కార్యదర్శి కన్నం వెంకన్న పార్టీ డివిజన్ కార్యదర్శి మహమ్మద్ రాజా సాహెబ్ మండల నాయకులు శ్రీను,మెతుకుపల్లి,రాజిరెడ్డి,అచ్చ తదితరులు పాల్గొన్నారు.

కరపత్రం తెలుగు దిన పత్రిక

సోమవారం సెప్టెంబర్ 22 2025

## గీతారెడ్డి దంపతులకు వివాహ శుభాకాంక్షలు తెలియజేసిన మాజీ ఎంపీటీసీ శంకర్ పటేల్

**ఝురాసంగం మండలం కరపత్రం ప్రతినిధి సెప్టెంబర్ 21**



ఈరోజు మాజీ మంత్రివర్యులు గీతారెడ్డి రామచంద్ర రెడ్డి వివాహ వార్షికోత్సవం రామచంద్ర రెడ్డి గారి 80వ పుట్టిన రోజు సందర్భంగా వారికి శుభాకాంక్షలు తెలిపి వారి ఆశీర్వాదం తీసుకోవడం జరిగింది ఈ కార్యక్రమంలో ఝురాసంగం మండలం ఎంపీటీసీ శంకర్ పటేల్ పీసీసీ సెక్రటరీ ఆర్గనైజేషన్ మహేందర్ హాజరు కావడం జరిగింది

## నేడు శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి

**ఆర్మూర్, కరపత్రం ప్రతినిధి సెప్టెంబర్ (21)**



ఆర్మూర్ రోటరీ క్లబ్ అఫ్ ఆర్మూర్ ఆధ్వర్యంలో చేనేత కాలనీ చౌరస్తా వద్ద గల కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం వద్ద వర్ధంతి నిర్వహించి నివాళులు అర్పించడం జరిగింది. అధ్యక్షులు రాధా కిషన్ మాటాడుతూ స్వాతంత్ర్య ఉద్యమం నుండి తెలంగాణ ఉద్యమం వరకు ఆవిరళ కృషి చేసిన అలుపెరుగని పోరాట యోధుడు అని కొనియాడారు. ఇట్టి కార్యక్రమంలో సెక్రటరీ ఖాందేశ్ సత్యం, కోశాధికారి కోట నరేష్, మాజీ అధ్యక్షులు దాసరి సునీల్ కుమార్, వంగ వివేకానంద, చెలిమేల రాజేందర్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రాథమిక పశువైద్యశాల పుల్కల్ నందు పశు వైద్య సిబ్బంది నియామకం

**పుల్కల్ కరపత్రం ప్రతినిధి**



పుల్కల్ మండల కేంద్రం పుల్కల్ లో ఉన్న పశు వైదశాలలో ఉన్న పశువైద్య అధికారి డా, పి. కీర్తి క్రమబద్ధమైన శిక్షణలో భాగంగా వెళ్లడం ఉన్న క్రింది స్థాయి సిబ్బంది పదోన్నతి బదిలీ పై వెళ్లడం వలన గత కొన్ని రోజుల నుండి పశు వైద్య సేవలపైన కొద్ది మేరా ప్రభావం పడిందని తాత్కాలిక ఇంచార్జ్, గొంగ్లూరు పశు వైద్య అధికారి డా,, శివకుమార్ గౌడ్ తెలిపారు. ఇట్టి విషయాన్ని జిల్లా పశు సంవార్షక పశు వైద్య అధికారి శ్రీమతి డా,, వసంత కుమారి దృష్టికి తీసుకెళ్లగా తాను స్పందించి కె. రాజు, లైవ్ స్టాక్ అసిస్టెంట్ ని డిప్యూటేషన్ పై నియమించారని తెలిపారు. సోమవారం 22 తేదీ నుండి పూర్తి స్థాయి పశు వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. అంతే కాకుండా శిక్షణ పై వెళ్లిన డా,,పి. కీర్తి అక్టోబర్ 1 నుండి అందుబాటులో ఉంటారని తెలిపారు. రైతుల విన్నపాలకు స్పందించి జిల్లా అధికారి డా,, వసంత కుమారి సిబ్బందిని నియమించడంతో వారు హర్షం వ్యక్తం చేశారు.

## ఖాదర్ పేట గ్రామంలో ఎల్ఓసి తో ఆసరగా నిలుస్తున్న ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి



**కరపత్రం ప్రతినిధి**

చెన్నారావుపేట మండలంలోని ఖాదర్ పేట గ్రామ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అధ్యక్షులు గూడ మహేందర్, నాయకులతో కలిసి గ్రామ పంచాయితీ ఆవరణలో లబ్ధిదారుడు అయినా కూస వెంకట్ రెడ్డికి సీఎం సహాయ నిది 16000 వేల రూపాయల చెక్కు పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా గూడ మహేందర్ మాట్లాడుతూ, తమ ప్రభుత్వం అనారోగ్యానికి గురై హాస్పిటల్ లో చికిత్స పొంది మెరుగుపడ్డ వారికి పార్టీలకతీతంగా ఆపదలో ఉన్న పేద ప్రజలకు అండగా నిలిచే పథకం సీఎం సహా నిధి అని అన్నారు. అదేవిధంగా పేద ప్రజల కష్టాలను గుర్తించి వారి సంక్షేమానికి పాటుపడుతున్న సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రతి అర్హుడికి సహాయం చేరడం కాంగ్రెస్ ప్రభుత్వ హృదయాన్ని చూపిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు (పాత్రికేయులు) కూస సుదర్శన్ నాయకులు ఉప్పుల దేవేందర్, పెండ్లి రాజేందర్, కూస కుమారస్వామి, సాయిబాబు, చాపల మధుకర్,పెంతల రాజు, చెవ్వ యాదగిరి, గూడ రవీందర్, కొత్తపల్లి వెంకటేష్, ముస్కు బుచ్చయ్య,అశోక్,కూస ఎల్లయ్య గ్రామ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు కూస కరుణాకర్,గుంటి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు యూరియా కొరత లేకుండా చూడాలి

**- ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి**

**కలమే నా ఆయుధం పరకాల**



పరకాల నియోజకవర్గంలోని రైతులకు యూరియా ఎరువు కొరత తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆదివారం పరకాల పట్టణంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వ్యవసాయ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రైతులకు అవసరమైన యూరియా సమయానికి అందుబాటులో ఉండేలా అధికారులు పర్యవేక్షించాలన్నారు. మండలాల వారీగా డిమాండ్ కు అనుగుణంగా సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. స్టాక్ అందుబాటులో ఉన్న మేరకు టోకెన్ పద్ధతిలో రైతులకు యూరియా బస్తాలు అందజేయాలని, ఇప్పటికే రావలసిన కోటా వచ్చినందున సకాలంలో పంపిణీ జరుగుతుందని తెలిపారు. రాజకీయ ప్రయోజనాల కోసం కొందరు యూరియా కొరతపై అసత్య ప్రచారం చేస్తున్నారని విమర్శించారు.

## హుస్నాబాద్ లో స్వర్గీయ కొండా లక్ష్మణ్ బాపూజీ 13వ వర్ధంతి

**కరపత్రం ప్రతినిధి సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ 21**



మూడు తరాల ఉద్యమ నాయకుడు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కృషిచేసిన తెలంగాణ గాంధీ, కొండా లక్ష్మణ్ బాపూజీ 13వ వర్ధంతి కార్యక్రమాన్ని హుస్నాబాద్ పట్టణ పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో, హుస్నాబాద్ లోని శ్రీ శ్రీ భక్త మార్కండేయ స్వామి ఆలయ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. జాతీయ ఉద్యమంలో స్వాతంత్ర సంగ్రామంలో, ఉప్పు సత్యాగ్రహం లో , క్విట్ ఇండియా ఉద్యమంలో, ముల్కీ నిబంధనలకు వ్యతిరేక ఉద్యమంలో, 1969లో మొదలైన తెలంగాణ తొలి దశ ఉద్యమంలో మరియు మలిదశ ఉద్యమాలలో చురుకుగా పాల్గొని తెలంగాణ జాతిని సంఘటితం చేసి ప్రజలను చైతన్య పరచాడని కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహ ప్రతిష్టాపన కమిటీ అధ్యక్షులు వద్దేపల్లి వెంకటరమణ కొనియాడారు. సుమారు 17 సంవత్సరాలు ఎమ్మెల్యేగా మూడుసార్లు కేబినెట్ మంత్రిగా అపారమైన అనుభవాన్ని కలిగిన రాజకీయ దురందరుడు కొండా లక్ష్మణ్ బాపూజీ అని పద్మశాలి సేవా సంఘం అధ్యక్షులు బూర్ల రాజయ్య, కోమటి సత్యనారాయణ తెలిపారు. పదవుల కన్నా తెలంగాణ సాధన ధ్యేయంగా పనిచేసిన నిజాయితీ, నిబద్ధత కలిగిన నికార్సైన రాజకీయ వేత్త బాపూజీ జీవిత చరిత్ర నేటి తరానికి స్ఫూర్తిదాయకమని తెలిపారు. తను సంపాదించిన మొత్తంలో 75 శాతం ప్రజల కోసమే ఖర్చు చేసిన సేవ తత్పరునీ విగ్రహ స్థాపనకు ప్రజాప్రతినిధులు, అధికారులు కృషి చేయవలసిందిగా పద్మశాలి ప్రొఫెషనల్ అండ్ అఫీషియల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గాజుల భగవాన్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కోమటి స్వర్ణలత, దూడం నాగభూషణం, వద్దేపల్లి లక్ష్మయ్య, గుళ్లపల్లి కన్నయ్య, బూర్ల సత్యనారాయణ, చింతకింది శ్రీనివాస్, వెంకటనారాయణ, బుర్ల భాస్కర్, శ్రీనివాస్, వద్దేపల్లి బాలయ్య, నరసింహస్వామి,పాము రాజన్న, రాజు, రాయమల్లు, నారాయణ, సుదర్శన్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

## ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులర్పించిన నాయకులు

**- పద్మశాలి సంఘ సభ్యులు**

**కరపత్రం ప్రతినిధి**









ఈరోజు స్వాతంత్ర సమరయోధులు, తెలంగాణ ఉద్యమ నేత, స్వర్గీయ ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 13 వ వర్ధంతి సందర్భంగా ఈ రోజు ఆర్మూర్ పట్టణంలోని చేనేత కాలనీ చౌరస్తా వద్ద గల కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం వద్ద ఐదవ తర్ప, పట్టణ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వర్ధంతి కార్యక్రమానికి విశిష్ట అథితులుగా విచ్చేసిన మార్కెట్ కమిటీ చైర్మన్ సాయిబాబా గౌడ్, పీసీసీ మాజీ కార్యదర్శి, ప్రముఖ న్యాయవాది ఖాందేష్ శ్రీనివాస్ బాపూజీ విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఆర్మూర్ నియోజకవర్గ, ఆర్మూర్ మండల, పట్టణ మరియు వివిధ తర్పల పద్మశాలి సంఘం ప్రతినిధులు బాపూజీ విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ స్వాతంత్ర పోరాటంలో తెలంగాణ తొలి దశ మలి దశ ఉద్యమాలలో పాల్గొని బాపూజీ చేసిన పోరాటాల గురించి ఆయన నిర్వహించిన ఉద్యమ స్ఫూర్తి గురించి బాపూజీ చేసిన త్యాగాల గురించి కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ నియోజకవర్గ పద్మశాలి సంఘం ఇంచార్జ్ దాసరి సునీల్, పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షులు మోహన్ దాస్ మాట్లాడుతు బాపుజీ ని స్ఫూర్తిగా తీసుకుని పద్మశాలిలు రాజకీయముగా ఎదగాలని, సేవ కార్యక్రమములలో ముందుండాలని కోరారు. మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు సంగీతా ఖాందేష్, గుద్దేటి రమేష్ మండల పద్మశాలి సంఘం అధ్యక్షులు బొడ్డు గంగాధర్, ఐదవ తర్ప అధ్యక్షులు సైబసుధాకర్, సంఘం ప్రతినిధులు అంబల్ల శ్రీనివాస్, జిందమ్ నరహరి, నూకల శేఖర్, ఆడెపు ప్రభాకర్, చౌకే లింగం, కట్కమ్ నరేందర్, కొక్కుల విద్యాసాగర్, బత్తుల భాస్కర్, 8తర్పల అధ్యక్షులు నూకల నారాయణ, బండి అనంతరావు, చిట్ల యజ్ఞేశ్, రుద్ర రాజేశ్వర్, వెముల ప్రకాష్, సదమస్థుల గణపతి, అంబల్ల తిరుపతి, గెంట్యాల గణేష్, లింగం, రమణ అన్ని తర్ప సంఘాల అధ్యక్షులు మొదలగు వారు విచ్చేసి పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఖాందేష్ సత్యం, అజ్జు, శరత్, పద్మశాలి సంఘం కార్యవర్గ సభ్యులు, చేనేత కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు శ్రీనివాస్, మరియు అన్ని తర్పల కార్యవర్గ సభ్యులు, పట్టణ పద్మశాలి సంఘం కులబాంధవులు, వందేమాతరం యూత్ సభ్యులు గోక శరత్,అక్షయ్, భాను, విష్ణు, గిరీష్, కాలనీ వాసులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## లబ్ధిదారుల ఎంపికలో అక్రమాలు సిగ్గుచేటు

**- ప్రజాపాలనని మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం!**
**- అర్హులైన వారికే ప్రభుత్వ పథకాలు దక్కాలి!**
**- పార్టీలకతీతంగా నిరుపేదలకు న్యాయం చేయాలి!**
**- ధర్మ సమాజ్ పార్టీ హనుమకొండ జిల్లా కన్వీనర్ మైదం రవి మహారాజ్!**
**- అఖిలపక్షం ఆధ్వర్యంలో అర్హులైన లబ్ధిదారుల నుండి దరఖాస్తుల స్వీకరణ!**

**కరపత్రం ప్రతినిధి ఆత్మకూర్**





ప్రజా పాలన అని చెప్పుకుంటూ కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదలకు అన్యాయం చేస్తూ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలకే సంక్షేమ పథకాలను అమలు చేస్తూ అర్హులకు అన్యాయం చేస్తుందని ధర్మ సమాజ్ పార్టీ హనుమకొండ జిల్లా కన్వీనర్ మైదం రవి అన్నారు. ఆదివారం నాగయ్య పల్లె గ్రామంలో అర్హులైన నిరుపేదల నుండి అఖిలపక్షం ఆధ్వర్యంలో వివిధ సంక్షేమ పథకాలకు దరఖాస్తులు స్వీకరించారు. నాగయ్య పల్లె గ్రామం తో పాటు అన్ని మండలంలోని అన్ని గ్రామాలలో అర్హుల నుండి దరఖాస్తులు స్వీకరించి ఎంపీడీవో, జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారులకు పంపిస్తామని తెలిపారు. అఖిలపక్ష నాయకులతో కలిసి నిరుపేదలు నివసిస్తున్న గుడిసెలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేవలం కాంగ్రెస్ పార్టీ వారికి పథకాలు దక్కుతున్నాయని ప్రజలు తమ దృష్టికి తీసుకువచ్చారని ఇది భారత రాజ్యాంగం, ప్రజాస్వామ్యస్ఫూర్తి కి విరుద్ధమని ఇప్పటికైనా అనర్హుల పేర్లు తొలగించి అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు పాడి గేదెల పథకంతో పాటు వివిధ పథకాలను మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ధర్మ సమజ్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల జేఏసీ జిల్లా చైర్మన్ మాదాసి సురేష్ ధర్మ సమాజ్ పార్టీ మండల అధ్యక్షుడు బాగాజీ రజనీకాంత్ గ్రామ అధ్యక్షుడు మాదాసి సుధాకర్ బిజెపి గ్రామ అధ్యక్షుడు పోగుల యాదగిరి మాజీ సర్పంచ్ మాదాసి సాంబయ్య డీఎస్పీ మండల నాయకుడు మాదాసి రాజులతో పాటు బాధితులు పాల్గొన్నారు.

## బాల్య మిత్రుడు కుటుంబానికి అండగా బాసట స్నేహితుల బృందం

**- 50 వేల నగదు అందజేసిన 1998-99 పదవ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు..**

**ఆర్మూర్, కరపత్రం ప్రతినిధి సెప్టెంబర్ (21)**



నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గంలోని బాల్కొండ మండల కేంద్రంలో ఉపాధి హామీ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్ గా పనిచేస్తూ విధి నిర్వహణలో అకస్మాత్తుగా గుండెపోటుకు గురై మృతి చెందిన బాల్య మిత్రుడి కుటుంబానికి పూర్వపు బాల్య మిత్రు లందారు బాసటగా ఉంటామని చెబుతూ అండగా నిలిచారు. ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్ర పరిధిలోని పెర్కిట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1998- 99 పదవ తరగతి బ్యాచ్ కు చెందిన ఇరగనేని ధనుంజయ్ ఈ నెల 11 న గురువారం గుండెపోటుకు గురై మృతి చందగా మరుసటి రోజు శుక్రవారం బాల్కొండలో అశ్రు నయనాల మధ్య కుటుంబ సభ్యుల, బంధువుల, అధికారుల, స్నేహితుల మధ్య అంత్యక్రియలు నిర్వహించారు. కాగా ఆదివారం మృతి చెందిన బాల్య మిత్రుడు ధనుంజయ్ ఇంటికి వెళ్లి బాల్యమిత్రుడి సతీమణి శ్రీలత కి తోటి పూర్వ స్నేహితుల బృందం తలా కొంత నగదును జమ చేసి రూ. 50000/- డబ్బులను అందజేసి ఆ కుటుంబానికి బాసటగా నిలిచారు. అదేవిధంగా వారి కుటుంబ సభ్యులకు క్వింటాల్ బియ్యాన్ని పూర్వ విద్యార్థులు అందజేశారు. తోటి పూర్వ విద్యార్థులు తలా కొంత జమ చేసి మృతి చెందిన బాల్యమిత్రుడి కుటుంబానికి అందజేసి ఆ డబ్బులను వారి పాప వేద గాయత్రి పేరిట ఫిక్స్ డిపాజిట్ చేయించి భవిష్యత్తు అవసరాల దృష్ట్యా వాడుకోవాలని ఆ కుటుంబ సభ్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో బాల్య పూర్వపు మిత్రులు ఇట్టేడి మోహన్ రెడ్డి, మూడ అశోక్, రాస భూమేశ్వర్, వేల్పుల లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.